# నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, గురువారం 25 జూలై 2024 | NIZAMABAD




కోటగిరి ఎస్‌బీఐలో రైతుల సందడి

## పరదాలే రక్షణగా..

**నిజామాబాద్ జీజీహెచ్‌లోని** మూడో అంతస్తులో కిటికీలకు ఉన్న అద్దాలు ఇటీవల పగిలిపోయాయి. వర్షం కురిసిన సమయంలో కిటికీల ద్వారా రోగులు ఉండే వార్డులోకి నీళ్లు వస్తున్నాయి. దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వాన నీరు లోపలికి రాకుండా కిటికీలకు అడ్డంగా రోగుల బెడ్‌ల మధ్య ఉండే పరదాలను పెట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని రోగులు కోరుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



# మాఫీ మాయ



- మోర్తాడ్ సొసైటీలో పది శాతం మందికే రుణమాఫీ
- ఆందోళనలో అన్నదాతలు
- బ్యాంకుల వద్ద కొనసాగుతున్న రైతుల రద్దీ

మోర్తాడ్, జూలై 24: రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడుత రూ.లక్షలోపు రుణ మాఫీ చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించి జాబితా వెల్లడించిన ప్పటి నుంచి రైతుల్లో ఆందోళన కొనసాగుతూనే ఉన్నది. రుణ మాఫీ విషయంలో అధికారులకు పూర్తిస్థాయి సమాచారం లేక ఇంట్లో ఉన్నవారందరీ రుణాలను లెక్కించి వచ్చే దఫాలో వస్తాయని, రూ.2లక్షల వరకు ఉంటే ఆగస్టు 15 తర్వాత వస్తా యని అప్పటి వరకు ఆగాలని రైతులకు చెబుతున్నారు. రుణమాఫీ విషయంలో ఏమైనా ఫిర్యాదులు వస్తే రికార్డులో రాసుకోవాలని పైఅధికారులు చెప్పినట్లు వ్యవసాయాధికారులు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో రేషన్‌కార్డులు లేనివారు, రేషన్ కార్డు ఉన్నా అందులో పేరు లేనివారు, గల్ఫ్ వెళ్లిన కారణంగా రేషన్‌కార్డుల్లో పేరులేని వారి పరిస్థితి ఏమిటన్న విషయంలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సొసైటీ, బ్యాంకుల్లోనూ 25శాతం మాత్రమే రూ.లక్షలోపు రుణమాఫీ పొందిన రైతులు కనబడుతున్నారు. మోర్తాడ్ సొసైటీలో మొత్తం 686 మంది రైతులు రుణాలు తీసుకున్నారు. ఇందులో రూ.50వేల వరకు 401 మంది, రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు 156 మంది, రూ.లక్ష నుంచి లక్ష న్నర వరకు 75 మంది, రూ.లక్షన్నర నుంచి 2లక్షల వరకు 54 మంది రైతులు రుణాలు తీసుకున్నారు. ఇందులో 557 మంది రైతులు రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్న వారు ఉండగా కేవలం 61మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయ్యింది. దీంతో చాలా మంది రైతులు రోజూ సొసైటీకి వచ్చి తమకెందుకు రుణమాఫీ రాలేదని అడిగి తెలుసుకుంటున్నారు.



కోటగిరి ఎస్‌బీఐ ఎదుట ప్రదర్శించిన రుణమాఫీ జాబితాను బుధవారం పరిశీలిస్తున్న రైతులు

### రోజుకో ప్రకటనతో ఆందోళన

చాలా మంది రైతులకు రూ.లక్షలోపు రుణం ఉన్నా మాఫీ రాలేదు. రేషన్‌కార్డు ప్రామాణికం అని చెప్పడం, రేషన్‌కార్డు లేకున్నా రుణమాఫీ ఇస్తామని చెప్పడం, రేషన్‌కార్డు కుటుంబానికి ప్రామాణికత కోసమేనని, రుణమాఫీ కోసం కాదని ఇలా రోజుకో ప్రకటన రావడంతో రేషన్‌కార్డు లేని, రేషన్‌కార్డుల్లో పేరులేని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంతకూ తమకు మాఫీ వస్తుందా లేదా అని అధికారులను అడిగితే రేషన్‌కార్డులో పేరులేనందున రాలేదని చెబుతున్నారని రైతులు అంటున్నారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లిన వారి కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నా గల్ఫ్ వెళ్లిన వారి పేర్లు రేషన్‌కార్డుల్లో లేవు. అలాంటి వారికి కూడా రుణమాఫీ రాలేదు. గల్ఫ్ వెళ్లిన వారు తామేం పాపం చేశామని, తమకెందుకు రుణమాఫీ రాలేదని వాపోతున్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం విధిస్తున్న వివిధ రకాల కొర్రీలతో రైతులు వర్రీ అవుతున్నారు. రూ.2లక్షల రుణమాఫీ జాబితా ప్రకటించే వరకు తమకు కూడా మాఫీ వస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు.

### నా పేరులో వై అక్షరం లేదంటున్నారు..



నాకు బ్యాంకులో రూ.48వేల పంట రుణం ఉన్నది. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలోపు రుణాలు ఉన్న వారికి మాఫీ చేస్తున్నామని ప్రకటించడంతో నాకు కూడా వస్తుందని అనుకున్నాను. కానీ బ్యాంకుకు వెళ్లి అడిగితే మాఫీ రాలేదన్నారు. కారణమేంటని అడిగితే నీ పేరు యూసుఫ్‌లో వై అనే అక్షరం లేనందున అని చెప్పింండ్రు. పేరు తప్పె వరు పంపించింండ్రు, మాఫీ రాకపోవడానికి కారణమెవరు? నాకు మాఫీ రాకపోతే బ్యాంకు వారు తిరిగి డబ్బులు కట్టమని అడగరా, మేమేం తప్పు చేశామని మాకు రుణమాఫీ రాదు. అన్ని పత్రాలు సరిగ్గానే ఉన్నాయి అయినా మాఫీ రాలే.

**- యూసుఫ్, మోర్తాడ్**

### ఎవరూ సరైన సమాధానం చెప్తలేరు



నాకు స్టేట్ బ్యాంకులో వడ్డీతో కలిపి రూ.96వేల రుణం ఉన్నది. రుణమాఫీ జాబితాలో నాపేరు లేదు. బ్యాంకు మేనేజర్ దగ్గరకు వెళ్లి అడిగితే మాకేం సంబంధం లేదు, రుణాలకు సంబంధించి మేమేం లిస్ట్ పంపించలేమంటున్నారు. వ్యవసాయ అధికారుల దగ్గరికి వెళ్తే మాకేం తెలియదు అంటున్నారు. నాలాగే చాలా మందికి రుణమాఫీ రాలేదు. ఈ విషయంలో బ్యాంక్ అధికారులు, వ్యవసాయ అధికారులు సమాధానం చెప్పడం లేదు. నాకు రుణమాఫీ వస్తుందా....రాదా అనేది ప్రశ్నగానే ఉన్నది. కనీసం రాని వారి నుంచి తిరిగి దరఖాస్తులు కూడా తీసుకోవడం లేదు. మరో రెండు విడుతల రుణమాఫీ ప్రకటిస్తే పరిస్థితి ఏంటో అర్థమవుతలేదు.

**-గోపిడి సత్యనారాయణ, మోర్తాడ్**

### రేషన్‌కార్డులో పేరులేదని..



నేను ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్తున్నాను. అయితే మా కుటుంబానికి సంబంధించిన రేషన్‌కార్డులో నాపేరు లేదు. నాకు బ్యాంకులో రూ.90వేల రుణం ఉంది. ప్రభుత్వం రూ.లక్షలోపు రుణాలు ఉన్నవారందరికీ మాఫీ చేసిందని తెలిసి బ్యాంకులోకి వెళితే రుణమాఫీ రాలేదని చెప్పారు. ఎందుకు రాలేదని వ్యవసాయాధికారులను అడిగితే రేషన్‌కార్డులో పేరులేదని చెబుతున్నారు. రేషన్‌కార్డులో పేరు లేకపోతే నాకు రుణమాఫీ రాదా, గల్ఫ్ వెళ్లడమే మేము చేసుకున్న తప్పా?

**- నల్ల గంగాధర్,రైతు, మోర్తాడ్**

### రేషన్ కార్డు లేకపోతే మాఫీ చెయ్యరా?

నాకు రేషన్‌కార్డు లేదు. రుణమాఫీ రాలేదు. నేను మోర్తాడ్ సొసైటీలో రూ.52 వేల లోన్ తీసుకున్న. రుణమాఫీ చేసింండ్రని సొసైటీకి వెళ్లి అడిగితే మాఫీ రాలేదన్నరు. ఎందుకని తెలుసుకుంటే రేషన్‌కార్డు లేనందుకు మాఫీ రాలేదంటుండ్రు. రేషన్‌కార్డు లేకుంటే రుణమాఫీ చెస్తరో..చెయ్యరో.

**- ఎలేటి వెంకన్న, రైతు, తిమ్మాపూర్**

## విద్యుదాఘాతంతో రైతు మృతి

బిచ్కుంద, జూలై 24: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన బిచ్కుంద మండలం రాజాపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపూర్ గ్రామానికి చెందిన కొత్త రాములు తన పొలంలో బుధవారం నాటు వేస్తున్నాడు. బోరు మోటర్‌కు సంబంధించిన కరెంటు వైరు తెగి పొలం మధ్యలో పడడంతో అది గమనించి గెట్టు మీద వేసే క్రమంలో షాక్ తగిలింది. దీంతో రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# క్షమాపణ సరే..

# తప్పు చేసిందెవరు?



విలేకరులతో మాట్లాడుతున్న ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

- ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా రుణమాఫీ మంజూరు
- వివరాల నమోదులో అడుగడుగునా నిర్లక్ష్యం
- ట్రైపార్టీ అగ్రిమెంట్ పేరుతోనే రుణాలు లేపిన యాజమాన్యం
- రైతుల్లో చర్చనీయాంశమైన ''నమస్తే తెలంగాణ'' కథనం


నమస్తే తెలంగాణ

కామారెడ్డి

ఒప్పందాల పేరిట

దారుణం

*రుణం తీసుకోకుండానే రుణమాఫీ జరిగిన ఘటనలో అనేక సందేహాలు వెలుగు చూస్తున్నాయి. గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ, యూనియన్ బ్యాంకు, రైతుల మధ్య జరిగిన ట్రైపార్టీ ఒప్పందం మేరకు రుణాల మంజూరు జరిగింది. ఇందులో చట్టబద్ధతను పక్కన పెడితే రుణమాఫీ అంశంలో చోటు చేసుకున్న లోపాలు పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ విషయం 'నమస్తే తెలంగాణ' పత్రికలో బుధవారం మెయిన్, జిల్లా సంచికల్లో ప్రచురితం కావడంతో ప్రభుత్వ యంత్రాంగం కూడా అవాక్కయ్యింది. ఇంతటి ఘోరమైన తప్పిదం ఎలా జరిగిందో? అన్న అనుమానాలను ప్రభుత్వ పెద్దలు సైతం వ్యక్తం చేసినట్లుగా తెలిసింది. నమస్తే తెలంగాణ కథనంపై ప్రభుత్వవర్గాల నుంచి వివరాలు ఆరా తీయడంతో కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అడుగు ముందుకేశారు. కామారెడ్డి ఆర్డీవో, జిల్లా వ్యవసాయ అధికారితో విచారణకు ఓ కమిటీని వేశారు. రుణమాఫీ అంశం బయటపడడంతో షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం సైతం మల్లగుల్లాలు పడింది. ఏకంగా ఫ్యాక్టరీ ఎండీ ఆదేశాలతో రంగంలోకి దిగిన వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు ఏకంగా రైతులకు బహిరంగ క్షమాపణలు కోరారు. తప్పు జరిగిందని, సరిదిద్దుకుంటామంటూ వ్యాఖ్యానించారు. రైతులకు తిరిగి డబ్బులు చెల్లిస్తామంటూ హామీ ఇచ్చారు. యూనియన్ బ్యాంకు నుంచి రుణాలను పదిరోజుల్లోనే కట్టేస్తామన్నారు.*

*–నిజామాబాద్, జూలై 24*
*(నమస్తే తెలంగాణ ప్రతినిధి) / రామారెడ్డి*

### కదిలించిన 'నమస్తే తెలంగాణ' కథనం..

చెరుకు సాగుకు తప్ప రుణాల విషయంలో రైతులెవ్వరూ గాయత్రీ ఫ్యాక్టరీకి ఎలాంటి ఒప్పందాలను రాసివ్వరు. కానీ ఇదే అదనుగా భావించి రూ.కోట్లలో రుణాలను ఫ్యాక్టరీ సేకరిస్తుండడం మొదటిసారి బయటపడింది. ఇందులో రుణమాఫీ పరిధిలోని రుణాలు కూడా ఉండడంతో రైతులంతా లబోదిబోమనగా ''నమస్తే తెలంగాణ'' అండగా నిలిచింది. రైతులతో మాట్లాడి వారి వేదనను అక్షరరూపంలో పెట్టగా ఈ నెల 24న బుధవారం రైతు చేయని రుణాలూ మాఫీ, ఒప్పందాల పేరిట దారుణం... అనే శీర్షికతో మెయిన్, జిల్లా సంచికలో కథనాలను ప్రచురించింది. ఈ కథనాలు రైతులకు చేరడంతోపాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ కథనాలపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం వివరాలను ఆరా తీసింది. సంబంధీకులపై సీరియస్ కావడంతో గాయత్రీ షుగర్స్ యాజమాన్యం దిగొచ్చింది.

### తప్పెవరిది...?

కామారెడ్డి జిల్లాలో రూ.కోట్లలో రుణమాఫీ నిధులు పక్కదారి పట్టడంపై తీవ్ర గందరగోళం ఏర్పడింది. ట్రైపార్టీ కింద మంజూరైన రుణాలకు వాస్తవానికి మాఫీ వర్తించదు. సర్కారు జారీచేసిన మార్గదర్శకాల్లోనూ ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ రకమైన ఒప్పందాలతో తీసుకున్న రుణాలను సాంకేతికంగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్(ఎస్‌హెచ్‌జీ) మాదిరిగానే పరిగణిస్తుంటారు. కానీ బ్యాంకులు, వ్యవసాయాధికారులు మాత్రం రుణమాఫీ కింద వీటిని పరిగణించడం ఏమిటంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. రైతుల ఫోన్లకు రుణమాఫీ మెస్సేజ్‌లు రాకపోయి ఉంటే ఈ తతంగం చాటున రుణమాఫీ పేరిట మంజూరైన సొమ్ము అప్పనంగా పక్కదారి పట్టి ఉండేది కదా? అన్న చర్చ జరుగుతున్నది. ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించేందుకు ఎవరైనా ఇందులో భాగస్వామ్యమై ఉన్నారా? అనే కోణంలో విచారిస్తే పూర్తి వివరాలు తెలిసే అవకాశాలు లేకపోలేదు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులను ఈ విషయంపై వివరాలు అడిగితే స్పందించేందుకు ముఖం చాటేస్తున్నారు.

### కనిపించని పారదర్శకత..

గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీస్, రైతులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్య ట్రైపార్టీ అగ్రిమెంట్ అన్నది 20ఏండ్ల నుంచి కొనసాగుతున్నది. ఇందులో రైతుల పాత్ర సూక్ష్మమే. పత్రాలపై సంతకాలతోనే సరిపెడుతారు. కానీ ప్రధానంగా బ్యాంకు, షుగర్ ఫ్యాక్టరీ మధ్య ఒప్పందం అధికారికంగా జరుగుతుంది. ఈ విషయం సగానికి ఎక్కువ మంది రైతులకు తెలియదు. ట్రైపార్టీ అగ్రిమెంట్ ఆధారంగా చేసుకొని యూనియన్ బ్యాంకు నుంచి షుగర్ ఫ్యాక్టరీ రుణాలను తీసుకున్నది. ఇందులో ఫ్యాక్టరీ ఆస్తులను పూచీకత్తుగా యూనియన్ బ్యాంకు పరిగణలోకి తీసుకున్నది. ఈ ఒప్పందాల్లో రుణాల అంశం రైతులకు ఎవ్వరికీ తెలియకపోవడం ఇందులో దాగి ఉన్న రహస్యం. ఇరవై ఏండ్ల నుంచి రుణాలు తీసుకుంటున్నామని యాజమాన్యం బుధవారం ప్రకటించింది. కానీ గతంలో ఎప్పుడూ ఈ విషయంపై రైతులకు సమాచారమే ఇవ్వలేదు. గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో రైతులకు జరిగిన మోసంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు కనీసం పెదవి విప్పలేదు. అసెంబ్లీ సమావేశాల నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ సొంత నియోజకవర్గంలో జరిగిన తంతుపై స్పందించకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### విచారణకు కమిటీని వేశాం...

''నమస్తే తెలంగాణ'' దినపత్రికలో వచ్చిన కథనం ఆధారంగా గాయత్రీ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో అనర్హులకు రుణమాఫీకి సంబంధించిన అంశంపై విచారణకు ఆదేశాలు జారీ చేశాం. ఆర్డీవో, జిల్లా వ్యవసాయాధికారులకు ఈ బాధ్యతలను అప్పగించాను. రెండు రోజుల్లోనే విచారణ నివేదిక వస్తుంది. ఆ తర్వాత అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

**- ఆశీష్ సంగ్వాన్, కలెక్టర్, కామారెడ్డి**

డిచ్‌పల్లి మానవతా సదన్‌లో నిర్వహించిన కేటీఆర్ బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



## రామన్నకు హ్యాపీ బర్త్‌డే

**బీఆర్‌ఎస్ వర్కింగ్** ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పుట్టిన రోజు వేడుకలను ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీ నేతలు బుధవారం ఘనంగా నిర్వహించారు. డిచ్‌పల్లి మానవతా సదన్‌లో ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, మద్నూర్ మండలం మేనూర్‌లో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే కేక్ కట్ చేశారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా హైదరాబాద్‌లో కేటీఆర్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.




కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల, మాజీ ఎమ్మెల్యే బిగాల



మద్నూర్ మండలం మేనూర్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే



జీపీ కార్యదర్శులు అజయ్,విజయ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

### తమ్ముడికి వీడ్కోలు..అన్నకు స్వాగతం..

మోర్తాడ్, జూలై 24: మోర్తాడ్ మండలంలో తమ్ముడు పనిచేసిన గ్రామపంచాయతీకి అన్న, అన్న పనిచేసిన గ్రామపంచాయతీకి తమ్ముడు బదిలీపై వెళ్లారు. గాండ్లపేట్ జీపీ కార్యదర్శిగా మోర్తాడ్‌కు చెందిన బావల అజయ్ పనిచేసి , తన అన్న బావల విజయ్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన కమ్మర్‌పల్లి మండలం ఇనాయత్‌నగర్‌కు వెళ్లగా, తమ్ముడు అజయ్ పనిచేసిన గాండ్లపేట్‌కు విజయ్ బదిలీపై వచ్చారు. దీంతో బుధవారం గాండ్లపేట్‌లో ఇద్దరినీ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మామిడి సౌజన్య, సుమన్, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.